
# ఒదుగు

వి. రాజారామమోహనరావు

**ఆ అనుభవం లతకి ఇప్పటికీ కళ్ళకు కట్టినట్లుంది. రవితో మొదటిసారి ఆ కలయిక... పద్నాలుగేళ్ళు గడిచిపోయాయి.**

**గతంలో వున్నంత ఉద్రేకం లేదు. ఆ రోజుల్లో ఉద్వేగం సెలఏటి ఒరవడిలాంటిది. రాత్రంతా కలిసి గడిపినా, మధ్యాన్నానికి మళ్ళీ కొత్తగానే వుండేది. ఇప్పుడు... ఆ ఆర్తి, తపన అలాగేవున్నా, నిండైనా నదిలాంటి ఓ కుదురు వచ్చింది.**



రవిని తలుచుకున్నప్పుడల్లా బతుకిలా చాలా దగ్గరైనదేదో మనసుని కమ్ముకున్నట్టుంటుంది లతకి. జీవితపు ఆనందం ఇదీ అనిపిస్తుంది. శరీరాల సంబంధమే కాదు, మానసికంగా ఓ ఒదుగు... బతకాలి అనిపించే ఏదో ఓ అంతర్ చేతన.

ఈ బంధమనే కాదు, ఎలాంటి దగ్గరతనానికైనా, ఎదుటివారు వేలెత్తి చూపిస్తారేమోనన్న జంకు. ముల్లులా పొడుస్తూనే వుంటుంది. లతలోనూ ఆ ఇబ్బంది వుంది. రవీ, తనూ పెళ్ళిచేసుకునే అవకాశం... ఓ రకంగా ఉంది. మరో రకంగా లేదు.

లతకి నలభై ఆరేళ్ళు. రవికి యాభై మూడు. రవి భార్య పోయే నాటికి ప్రియకి నాలుగేళ్ళు. చిన్నపిల్ల భారతికి రెండేళ్ళు. రవికి వాళ్ళిద్దరే సంతానం.

అప్పటికి రెండేళ్ళక్రితమే లత భర్త మరణించాడు. భర్త తాలుకు ఆస్థి, ఉద్యోగం తాలుకు డబ్బు బాగానే లతకి, పిల్లలకి వచ్చాయి. అప్పుడు రవి, అతని భార్య వచ్చి లతకి ఎంతగానో సాయం చేశారు. లత కొడుకుకన్నా, కూతురు రెండేళ్ళు పెద్దది. పిల్లల కోసం లత తనని తను అంకితం చేసుకుంది. తండ్రి లేని బెంగ వాళ్ళకి తెలియకూడదని ఎంతగానో శ్రమించింది. ఆ సమయంలో రవి దంపతులు ఆ పిల్లలని ఎంతో దగ్గరగా చూస్తూ చూపించిన ఆప్యాయత అంతా ఇంతా కాదు. లత పిల్లల్ని తమ పిల్లలతో సమానంగా చూశాడు. అందుకే పిల్లలు నలుగురికీ ఎంతో ఇష్టంగా కలిసి మెలిసి గడ

పటం అలవాటైంది.

అకస్మాత్తుగా రవి భార్య పోవటంతో, తన పిల్లల కన్నా ప్రియ, భారతి కోసం ఎక్కువగా బెంగ పడింది లత. వాళ్ళ మంచి చెడ్డలన్నింటికీ లతే అండ అయింది.

ఆ రోజు లతకి బాగా గుర్తు. పిల్లలందర్నీ ఆయా బైటకి తీసికెళ్ళింది. రవి నెమ్మదిగా లతని దగ్గరికి తీసుకున్నాడు. పిల్లలు నలుగురికీ తల్లీతండ్రిగా మెలుగుతున్న పరిస్థితో... అంతరాంతరాల్లో వున్న ఇష్టమో... లేదా మరికొన్ని ప్రభావాల కలగలుపో.. లత రవికి దగ్గరైంది. ఆరోజు నుంచీ లతకి రెండు కుటుంబాలూ ఒకటే అయ్యాయి. ఓ యేడాది తర్వాత చేస్తున్న ఉద్యోగం కూడా వదిలేసి, పూర్తి సమయం పిల్లల కోసమే గడిపింది.

రోజులు బాగానే గడిచాయి. లత కూతురికి పెళ్ళి అయిపోయింది. కొడుకు అమెరికాలో చదువుకుంటున్నాడు. రవి కూడా ఉద్యోగం మానేసి వ్యాపారం ఆరంభించి పదేళ్ళు అవుతోంది. ప్రియ, భారతి కాలేజీలో చదువుతున్నారు.

మనుషులందరూ ఒకటిగానే వున్నా, ఇళ్ళు మాత్రం రెండుగా వేరుగానే వున్నాయి.

పిల్లలకి తమ విషయం తెలుసని రవి, లత ఇద్దరికీ తెలుసు. పోతే చిన్న తెరమరుగు. విషయం తెలిసినట్టు ఎవరూ తేటతెల్లంగా బైట పడరు.

రవి పద్ధతి లతకి బాగా తెలుసు. ఎక్కువగా మాట్లాడడు. మనసు విప్పి విపులంగా ఏదీ చెప్పడు. అన్నీ పొడిపొడి మాటలే. చాలా విషయాల్లో మొండిగా వుంటాడు.

అంతకీ లత ఒకటి రెండు సార్లు అడిగింది. 'ఏం చేద్దాం?' అని.

'చేసేదేం వుంది. ఇలా గడపటమే...' అన్నాడు. తనవరకూ తను ఎంత మొండిగా వుంటాడో, ఎదుటివారి విషయంలో అంత మెత్తన. తన వల్ల ఎవరికీ కష్టం కలగకూడదన్న జాగ్రత్త. అతని బాధల్లా పిల్లల గురించి. కలిసి మెలిసే గడుపుతున్నా, వాళ్ళ మనసులో ఏముందో, దేనికి నొచ్చుకుంటుందోనన్న బెంగ. నలుగురి పిల్లల్ని కూచోపెట్టి మాట్లాడాలంటే లతకీ బెరుకే. ఈనాటి పిల్లలతో ఎంతో జాగ్రత్తగా వుండాలి. చాలా ఆవేశం... చిన్న చిన్న విషయాలకే ఆత్మహత్యల స్థాయి ఊహలు.


ఆడపిల్లల మనసులో తనకి ఏ స్థానం వుందో తెలియదు. అలాగే ఆ ఇంటిలో తన స్థానమేమిటో తెలియదు. అందుకే లత రవి ఇంటికి వాళ్ళవేపు బంధువులు ఎవరువచ్చినా తప్పించుకు తిరుగుతుంది. తన వేపు బంధువులంటే లతకి ఎప్పుడూ జంకులేదు. కానీ ఎంత ధైర్యం చెప్పుకున్నా రవి వేపు వాళ్ళంటే వెరపే. ఎవరు ఏ అనవసర ప్రసంగం చేసి ప్రియ, భారతీ మనసుని చెడగొడతారేమోనన్న భయం.

అందుకే రవి, లత దేనికీ పెద్దగా ప్రయత్నించకుండా, గడుస్తున్నా కాలంతో గడిపేస్తున్నారు.

రవికి ఆరోగ్యం పట్ల శ్రద్ధ లేదు. ఎప్పుడు తింటాడో ఎంత తాగుతాడో... ఓ పద్ధతి లేదు. ఎప్పుడూ దగ్గరే వుంటే తను మరింత జాగ్రత్తగా అతన్ని చూసుకోవచ్చని లత ఆశ. రవికి తెలియక కాదు. లత ఆశలన్నీ తెలుసు. అయినా అతనిలో ఏ మార్పులేదు. 'నేను ఇలా తప్ప మరోలా ఉండలేనన్నట్టు' ప్రవర్తిస్తాడు.

ఏదో తనలోని బాధ బైటికి చెప్పుకోలేక రవి అలా మొండిగా వుంటున్నాడేమోనన్న చిన్న అనుమానం లతలో లేక పోలేదు.

***



ఆ రోజు అలా జరుగుతుందని లీలగానేనా తోచలేదు లతకి.

ఉదయం ఏడు కూడా కాలేదు. ప్రియ ఎంతో కంగారుగా ఫోన్ చేసింది. లత వెళ్ళేటప్పటికి రవి ఇంచుమించు స్పృహలో లేడు. చెదురుమదురుగా 'ఊ... ఊ....'అని మూలుగుతున్నాడు. హాస్పిటల్‌లో చేర్చిన ఓ గంటకి కోలుకున్నాడు. ఆ గంటలో లత మనసులోకి ఎన్నెన్నో రకాల ఆలోచనలొచ్చాయి. ప్రియ, భారతి బెంబేలు పడిపోయారు.

మూడు రోజులు హాస్పిటల్‌లోనే ఉండాల్సి వచ్చింది. అన్ని పరీక్షల తర్వాత, అంత ప్రమాదమేం లేదన్నాక గానీ, లత ప్రాణం తేలిక పడలేదు.

రవి చాలా బలహీన పడ్డాడు. రక్తపోటు విషయంలోనే కాక, ఆరోగ్యం విషయంలో జాగ్రత్త అవసరం అన్నారు.

'రవికి ఏదేనా జరిగితే తన పరిస్థితి ఏమిటి? అసలు తమిద్దరి జీవితాలు ఏమిటి? పిల్లల బతుకేమిటి?'

దేనికీ సరైన సమాధానం లేదని లతకి తెలుసు.

లత అన్నాళ్ళు హాస్పిటల్‌లో రాత్రింబగళ్ళు కూడానే వున్నా రవేం మాట్లాడలేదు. 'ఉండక ఏం చేస్తావులే' అన్నట్టు ప్రవర్తించాడు.

హాస్పిటల్ నుంచి వచ్చేటప్పుడు మాత్రం... ''నువ్విలా నాకూడా లేకపోతే, పిల్లలు చాలా బెంగపడే వారు కదూ...'' అన్నాడు. అన్నింటినీ మనసులోనే దాచుకునే రవి, ఆ మాత్రం అలా అన్నందుకు ఎంతో ఆనందపడింది లత.

కానీ ఆ రాత్రి మాత్రం రవిలో మార్పు కనపడింది లతకి. అతని స్పర్శలో తేడా వుంది. దగ్గరకి తీసుకోవటంలో మరింత ఆప్యాయత వుంది. చూపించిన తొందరలో... నువ్వు లేకపోతే నేను ఎలా అన్న ఆర్తి వుంది. చేతుల్ని మరి కాస్సేపు వదలకుండా పట్టుకోవటంలో, ఇంకొంచం ఎక్కువ సేపు దగ్గరగా వుండటంలో... ఇలా... మాటలు లేకుండానే, స్పర్శలతోనే ఎన్నో, ఎన్నెన్నో అతని మనోభావాలు లతని చేరాయి.

అప్పుడు... ఆ క్షణంలో... అసంకల్పంగానే... ''నీ మనసులో ఏముందో ఎప్పటికీ చెప్పవా... రవీ'' అనడిగింది లత.

వెంటనే రవేం మాట్లాడలేదు. కాస్సేపటికి ''ఏం చెప్పను లతా... నా మనస్సు నాకే పెద్ద గందర గోళం... తను చనిపోతుందని ఎప్పుడూ అనుకోలేదు. మన జీవితాలు ఇలా అవుతాయనీ అనుకోలేదు. కానీ కళ్ళెదురుగా వున్న సత్యం కాదనుకోలేం. అలాగే మీ ఆయన... 'అక్కడ ఆ పిల్లలకీ, ఇక్కడ ఈ పిల్లలకీ ఈ రకం కలత లేకుండా వుంటే..' అన్న కోరిక. మళ్ళీ భయం... ఎప్పుడు

దేనికి వాళ్ళు నొచ్చుకుంటారోనన్న ఆరాటం...''

పరస్పరం చెప్పుకోలేక పోయినా ఏం కావాలో ఇద్దరికీ తెలుసు.

లత ఇంక ఆ సంభాషణని పెంచలేదు. రవి మరేం మాట్లాడలేదు.

***

రవి లతకి ఫోన్ చెయ్యటం అరుదు. అలాంటిది ఫోన్ చేసి ''నువ్వు అర్జెంటుగా రా.. రాగానే వివరాలు చెపుతాను'' అనేటప్పటికి చాలా హడావిడిగా వెళ్ళింది లత.

లత కోసం ఎదురు చూస్తూ బైటే నిలబడ్డాడు రవి. లతని చూడగానే దగ్గరికి వెళ్ళి...

''ఎక్కడెక్కడి వాళ్లో చుట్టాలు. కూడబలుక్కుని కట్టకట్టుకుని వచ్చారు. ప్రియకి సంబంధం తీసుకొచ్చారు. నాకంతా అయోమయంగా, చిరాగ్గా వుంది. నువ్వే మాట్లాడు. ఏ మాత్రం మొహమాట పడకు. ప్రియ మంచిచెడ్డలు నీకన్నా ఎవరికీ బాగా తెలియవు.'' అంటూ ఏ మాత్రం టైమివ్వకుండా వాళ్ళ దగ్గరికి తీసికెళ్ళాడు.

''లత... మంచిచెడ్డలన్నీ తనే మాట్లాడుతుంది'' అని మౌనంగా కూచుండిపోయాడు రవి.

ముందు చాలా కంగారు పడింది లత. మొత్తం ఆరుగురు వచ్చారు. రవి సవితి అప్పగారి కొడుక్కి సంబంధం. కొడుకుతో పాటు ఆవిడ రావటమేకాక, ముందుగానే చాలా నిర్ణయించుకుని వచ్చినట్టు మాట్లాడింది. ఆవిడ మాట చాలా పెళుసరంగా వుండటమేకాక, ఆవిడ పద్ధతీ మొరటుగానే వుంది.

రవి పద్ధతికీ, జరుగుతున్న వ్యవహారాలకీ ప్రియని తన కొడుకిలా చేసుకోటమే చాలా గొప్ప విషయం అన్నట్టు, అందుకుగాను ఇరవై ఎనిమిదేళ్ళ తన కొడుకు చదువు తదితర బాధ్యతలు రవి భరించటమే కాక, ఎంతో కొంత ఆస్తి వెంటనే ముట్ట చెప్పాలన్నవి ఆవిడ ఉద్దేశం.

పెళ్ళికొడుకు ప్రియకే కాదు. ఎవరికీ నచ్చేలా లేడు. పైగా వాళ్ళ దృష్టి పెళ్ళి మీదకన్నా రవి ఆస్తి మీదే అన్నది స్పష్టంగా తెలుస్తోంది. లతకి ఎక్కడ లేని ధైర్యం తెగింపు వచ్చాయి.

''ప్రియకి ఇప్పుడే పెళ్ళి చేద్దామన్న ఉద్దేశం లేదండి'' అంది లత చాలా నిబ్బరంగా.

''నువ్వెవరు చెప్పటానికి'' అంది ఆవిడ చాలా అసహ్యంగా లత వేపు చూస్తూ.

లతే కాదు. రవీ మాట్లాడ లేదు. మాట్లాట్టం అనవసరం అన్నట్టు కూచున్నారు.

వచ్చిన బంధువులందరూ తలో మాటా అన్నారు. అందరిదీ ఒకటే పద్ధతి. లతకి అంత పెత్తనం కూడదని, రవి ఇప్పటికేనా ఆడపిల్లల బాధ్యత విషయంలో సరిగ్గా వ్యవహరించాలని... వచ్చిన ఈ సంబంధం కాదనుకుంటే, బంధువుల అండదండలు లేకపోతే, ఆడపిల్లల పెళ్ళిళ్ళు జరగవని బెదిరింపుగా మాట్లాడారు.

రవి ఏం చలించకపోవటంతో వాళ్ళ ఉక్రోషం స్థాయి పెరిగింది. లతని అవమానించి నీచంగా మాట్లాడే స్థాయికి దిగజారారు. లతకి ఈ ఇంటికి సంబంధం ఏమిటో తేల్చమని నిగ్గదీశారు. అప్పటికీ ఉపయోగం లేకపోతే...

''ప్రియా... మీ నాన్న ఎలాగా పట్టించుకోడు. నువ్వు మరీ చిన్నపిల్లవేం కాదు. మీ నాన్న చేత కాని తనాన్ని, ఆవిడ పెత్తనాన్ని నువ్వే ఎదిరించాలి. నీ బాగే కాదు. నీ చెల్లెలి బాగూ ఆలోచించు..'' అంది మేనత్త వరస ఆవిడ.

లత కింక ఓర్పు నశించింది. వచ్చినవాళ్ళు ఎవరూ ఈ కుటుంబం మంచికోసం వచ్చిన వాళ్ళు కాదు. ఆవేశంగా వాళ్ళకి సమాధానం చెప్పబోయింది. ఈలోగా ప్రియ...

''అత్తయ్యా నేను చెపుతున్నాను. మీ దృష్టిలో ఆవిడకీ, ఈ ఇంటికీ ఏం సంబంధం లేదు. మీలాగా బంధువు కాదు. అంతేకాదు. మీ మనసులో ఏ ఉద్దేశం పెట్టుకు మాట్లాడుతున్నారో మాకు తెలుసు.

మా అమ్మ చనిపోయేనాటికి నాకు నాలుగేళ్ళు, చెల్లాయికి రెండేళ్ళు. అప్పుడు మా మంచి చెడ్డ లేమిటో చుట్టాలెవరికీ అక్కర్లేక పోయింది. నాన్న బాధేమిటో పట్టించుకున్న వారు లేరు.

నాన్న పద్ధతీ, ఆయన ముభావం చాలా మందికి అర్థం కాదు. అలాంటి ఆయన్ని అర్థం చేసుకుని, ఎంతో సాయంగా వుంది లతా ఆంటీ. అంతకంటే నాకు చెల్లాయికి ఆవిడ చేసిందేమిటో మాకు తెలుసు. టైముకి దగ్గరుండి అన్నం పెట్టింది. మాటలు, ఆటలు, పాటలు నేర్పింది. ఒంటరితనమంటే ఏమిటో తెలియనియ్యకుండా మమ్మల్ని పెంచింది. ఆడపిల్లలమైన మేము వేటికి భయపడాలో, వేటికి దూరంగా వుండాలో తెలియచెప్పింది. అమ్మలేని మాకు ఆంటీ లేకపోతే ఇవేవి దక్కేవికావు. ఈ ఇంటికీ, నాన్నకి మాకు, ఆవిడకి ఉన్న సంబంధం ఏమిటో అర్థమైందనుకుంటాను. ఆవిడే మాకు అమ్మ.... ఆవిడ ఇష్టంతోటే పెత్తనం తోటే మా పెళ్ళిళ్ళు జరుగుతాయి.'' అంది. వాళ్ళు ఇంకేమైనా అంటే ప్రియా, భారతి కలిసి తన్నేలా వున్నారు.

పావుగంట లోపే అందరూ వెళ్ళిపోయారు. అన్ని సంవత్సరాల జంకు, బెరుకు లతలోంచి వెళ్ళిపోయాయి. తల్లి మనసు ఎంతో తేలిక పడింది.

గొడవ జరిగినా, పరిష్కారం జరిగిన తీరు రవికి ఎంతో తృప్తినిచ్చింది.

ఆ తర్వాత ఎప్పుడో తామిద్దరే వున్నప్పుడు రవి లతవేపు చూస్తూ... ''షష్టిపూర్తి అప్పుడు పిల్లలందరూ కలిసి తల్లీతండ్రికి పెళ్ళి చేస్తారట కదూ'' అన్నాడు. రవి సరదాగానే అన్నాడో, ఆశగానే అన్నాడో లతకి ఎంతో స్థైర్యాన్నిచ్చాయి ఆ మాటలు.

★

వి.రాజారామమోహనరావు

93947 38805

## వాఙ్మయ మూర్తుల వాక్చాతుర్యం

నోరి నరసింహశాస్త్రిగారు నాటికలూ, నవలలూ, ముఖ్యంగా చారిత్రక నవలలు రాశారు. ప్రసిద్ధమైన కవితలూ కావ్యాలూ రాయలేదు. అందువల్ల ఆయన్ని నవలాకారునిగానే కాని, కవిగా ఎవరూ పరిగణించే వారు కాదు. ఆ కారణంగానే ఓ మారు ఏలూరు సాహిత్య మండలిలో దేవులపల్లి వేంకటకృష్ణశాస్త్రిగారి అధ్యక్షతన జరిగే కవి సమ్మేళనంలో నోరివారిని చేర్చడం దగ్గర సందేహం వచ్చింది. గరికిపాటి మల్లావధానిగారు ''నోరి కవి గాదు. అందువల్ల కవిసమ్మేళనంలో ఆయన్ని చేర్చకూడదు'' అని అడ్డుపడ్డారు.

ఆ వార్త ఒంగోలులో వున్న తల్లావఝుల శివశంకరస్వామికి తెలిసింది. ఆయనకి కోపం వచ్చింది. నోరి నరసింహశాస్త్రిగారు శివశంకర స్వామి గారికి ఆప్తులు. పైగా ఆయన సాహితీ సమితి అధ్యక్షులూ, నోరివారు కార్యదర్శీను. ఇద్దరి అనుబంధమూ దృఢతరమైనది. అందువల్ల శివశంకర స్వామి ''ఎంతైనా మా నోరి, గరికపాటి చెయ్యకపోడు'' అన్నారు.

ఆ కబురు మళ్ళీ ఎవరో గరికపాటి వారికి చేరవేశారు. ''నిజమే కావచ్చు. కాని గరికని తక్కువగా అంచనా వెయ్యడం మంచిది కాదు. గరిక చాలా పదును. కత్తికంటే వాడి ఎక్కువ. నోరుకి ప్రమాదం. తొందరపడితే నాలిక తెగవచ్చు'' అన్నారు.



ఆ మాట తర్వాత నోరి వారికీ చేరింది. శివశంకరస్వామి గారికీ తెలిసింది. అయితే వారూ, వీరూ నవ్వుకున్నారే కాని కోపం తెచ్చుకోలేదు. అదీ ఆనాటి సాహితీ మూర్తుల సంస్కారం.

★

Printed and Published by **Vemuri Radhakrishna,** Managing Director, on behalf of Aamoda Publications Pvt. Ltd., Plot No.76, Aswani Layout, Huda Heights, Jubilee Hills, Hyderabad-500 033. Ph.(040) 23558233/44, Fax No.23558288. Printed at Aamoda Press, R.S.No.191/3, Ward No.43, Donka Road, Patamata, Vijayawada - 520 010, Reg.No.: APTEL/2004/12594. Editor: **A.N.JAGANNADHA SARMA**